కాంగ్రెస్‌వి పగటి కలలు

- అధికారంలోకి వస్తామనడం హాస్యాస్పదం
- ముచ్చటగా మూడోసారి గులాబీ జెండా రెపరెపలు
- సీఎం పర్యటనపై రేపు సన్నాహక సమావేశం
- హాజరుకానున్న జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి
- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహులు

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహులు

నవాబ్‌పేట, అక్టోబర్ 12 : అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు పగటి కలలు కంటున్నారని, ఇది చూస్తే హాస్యాస్పదంగా ఉందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నర్సింహులు పేర్కొన్నారు. నవాబ్‌పేట మండల కేంద్రంలోని లక్ష్మీ నర్సింహ రైస్ మిల్లు ఆవరణలో ఈనెల 14వ తేదీన సీఎం కేసీఆర్ సభ సన్నాహక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈనెల 18వ తేదీన సీఎం కేసీఆర్ జడ్చర్లలో నిర్వహించే బహిరంగ సభకు గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివెళ్లే విధంగా క్యాడర్‌కు దిశానిర్దేశం చేసేందుకు గానూ ఈ సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు. శనివారం ఉదయం 9గంటలకు సన్నాహక సమావేశం ఉంటుందని తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడతారని వివరించారు. 18వ తేదీన సీఎం సభకు మండలం నుంచి నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున జడ్చర్లకు తరిలే విధంగా ఎమ్మెల్యే క్యాడర్‌కు వివరిస్తారని తెలిపారు. సుమారు 2వేల మంది గులాబీ శ్రేణులతో నవాబ్‌పేటలో సన్నాహక సమావేశం చేపడతామన్నారు. నవాబ్‌పేటలో నిర్వహించే సదస్సుకు వివిధ గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కార్యక్రమంలో ఎంపీపీ అనంతయ్య, జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, ముడా డైరెక్టర్ చెన్నయ్య, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు తాహేర్, సర్పంచులు గోపాల్‌గౌడ్, యాదయ్య యాదవ్, నాయకులు కృష్ణగౌడ్, నర్సింహులు, హన్మంతు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నోడల్ అధికారులతో సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

జడ్చర్ల, అక్టోబర్ 12 : అసెంబ్లీ ఎన్నికల లో భాగంగా గురువారం నోడల్ అధికారులతో అదనపు కలెక్టర్, జడ్చర్ల అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మోహన్ రావు సమావేశం నిర్వహించారు. జడ్చర్ల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల విధులలో భాగంగా మొత్తం 20మంది మండల్ లేవల్ అధికారులను నోడల్ అధికారులను ఏర్పాటు చేశారు. వారు ఎన్నికలకు సంబంధించిన వివిధ విధులను నిర్వహిస్తారు. దానికి సంబంధించి రిటర్నింగ్ అధికారి మోహన్‌రావు వారితో సమావేశమై వారికి బాధ్యతలను అప్పగించారు. పీవో, ఏపీవోలకు శిక్షణ, ఈవీఎంల బాధ్యత, ఎలక్టోరల్‌రోల్, హెల్ప్‌లైన్, ఫిర్యాదులు, హెల్త్, పోస్టల్‌బ్యాలెట్, వెబ్, వీడియో, తదితర విభాగాలకు వారిని నియమిస్తారు. వారంతా వారికి కెటాయించిన పనులను విధిగా నిర్వహించాల్సి ఉంటుంది. ఎన్నికల కోడ్‌ను ప్రతిఒక్కరూ పాటించాలని సూచించారు. అలాగే వీవీఎంల భద్రత కోసం బీఆర్ఆర్ డిగ్రీ కళాశాలను ఆయన పరిశీలించారు. సమావేశంలో తాసీల్దా ర్ శ్రీనివాసులు, ఎంఈవో మంజూలాదేవి, మున్సిపల్ కమిషనర్ మహమూద్‌షేక్ ఉన్నారు.

బహిరంగ సభా స్థలాన్ని డోజర్లతో చదును చేస్తున్న దృశ్యం

సీఎం సభకు ముమ్మర ఏర్పాట్లు

- 18న జడ్చర్లకు ముఖ్యమంత్రి కేసీఆర్ రాక
- సభాస్థలాన్ని చదును చేయిస్తున్న నాయకులు

జడ్చర్ల, అక్టోబర్ 12 : ఈనెల 18వ తేదీన జడ్చర్లలో సీఎం కేసీఆర్ నిర్వహించనున్న బహిరంగ సభకు సంబంధించి ఏర్పాట్లు ముమ్మరం చేశారు. జడ్చర్ల శివారులోని గంగాపూర్‌లో ఉన్న శివాలయం సమీపంలో బహిరంగసభను నిర్వహించనున్నారు. సభ ప్రాంగణంతోపాటు హెలీప్యాడ్ స్థలాన్ని డోజర్లు, జేసీబీలతో చదును చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన పనులను జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. కాగా, సభకు భారీగా జనసమీకరణ చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. నియోజకవర్గంలోని జడ్చర్ల, మిడ్జిల్, ఊర్కొండ, నవాబ్‌పేట, బాలానగర్, రాజాపూర్ మండలాల నుంచి జనాలు వచ్చేలా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు.

కేఎల్ఐ కాలువలో వృద్ధురాలి మృతిదేహం లభ్యం

మిడ్జిల్, అక్టోబర్ 12 : కాలువలో పడి ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని చిల్వేర్‌లో చోటుచేసుకున్నది. గ్రామస్తుల కథనం మేరకు ఇటీవల గ్రామానికి చెందిన దేవాభాయ్(62) ఇంట్లో నుంచి వెళ్లింది. కుటుంబ సభ్యులు ఆమె అచూకీ కోసం వెతికిన కనిపించలేదని, గురువారం సాయంత్రం గ్రామ శివారుల్లోని కేఎల్ఐ కాలువలో ఆమె మృతదేహం కనిపించింది. గ్రామస్తులు సహకారంతో మృతిదేహాన్ని భయటకు తీశారు. మృతి గల కారణాలు తెలియరాలేదు.

సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

మిడ్జిల్ : బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న విద్యార్థినులు

మిడ్జిల్, అక్టోబర్ 12 : మండల కేంద్రంతోపాటు బోయిన్‌పల్లి, చిల్వేర్, కొత్తపల్లి, వాడ్యాల్, వేముల తదితర గ్రామాల్లో గురువారం ప్రభుత్వ, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, ప్రైవేట్ పాఠశాల్లో బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మలు, కోలాటాలు వేశారు. మిడ్జిల్ సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో ప్రత్యేకంగా బతుకమ్మను ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో బతుకమ్మలతో ర్యాలీ నిర్వహించి, బతుకమ్మలు ఆడారు. అనంతరం గ్రామ చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలానగర్‌లో..

బాలానగర్, అక్టోబర్ 12 : మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలో ముందుస్తుగా బతుకమ్మ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో బతుకమ్మను ఆడారు. అనంతరం సమీప చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవాబ్‌పేటలో..

నవాబ్‌పేట, అక్టోబర్ 12 : మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు గురువారం బతుకమ్మ సంబురాలను జరుపుకున్నారు. నవాబ్‌పేట, యన్మన్‌గండ్ల, ఇప్పటూర్, మరికల్ తదితర పాఠశాలల్లో విద్యార్థులు వివిధ రకాల పూలతో అందంగా తయారు చేసిన బతుకమ్మలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు బతుకమ్మలతో ఆడి పాడారు. కార్యక్రమంలో జీహెచ్ఎం దశరథ్‌నాయక్, నర్సింహులు ఉన్నారు.

నవాబ్ పేట : ఇప్పటూర్ ప్రాథమిక పాఠశాలలో..

సీఎల్ ఆర్ క్రికెట్ పోటీలు ప్రారంభం

జడ్చర్ల, అక్టోబర్ 12 : జడ్చర్లలోని డాక్టర్ బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గురువారం సీఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీఎల్ఆర్ క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి నిర్వాహకులు క్రీడాకారులను పరిచయం చేశారు. అనంతరం ఎమ్మెల్యే క్రికెట్ ఆడారు. అంతకుముందు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి నిర్వాహకులు క్రేన్‌సాయంతో భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రాజాపూర్, అక్టోబర్ 12 : ఈనెల 18న జడ్చర్ల పట్టణంలో సీఎం కేసీఆర్ అధ్యక్షతన నిర్వాహించే సభను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ మోహన్‌నాయక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీశైలంయాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జేజే ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంతోపాటు 18న జరిగే సీఎం కేసీఆర్ సభను మండల ప్రజలు, పార్టీ నాయకులు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు బచ్చిరెడ్డి, రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు నర్సింహులు, అల్తాప్, రమేశ్‌నాయక్, పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ

తిర్మలాపూర్‌లో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న నాయకులు

రాజాపూర్, అక్టోబర్ 12 : బీఆర్ఎస్ యూత్ వింగ్ మండలాధ్యక్షుడు వెంకటేశ్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలకేంద్రంలో వెంకటేశ్ జన్మదిన వేడుకలకు ఎమ్మెల్యే హాజరై కేక్‌కట్ చేశారు. అనంతరం తిర్మలాపూర్ గ్రామంలో మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. గ్రామంలో ప్రజలు సేదతీరేందుకు 20 సిమెంట్ బెంచీలు అందజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

బాలానగర్, అక్టోబర్ 12 : మండలంలోని పెద్దాయపల్లి చౌరస్తాలో శుక్రవారం నిర్వహించే బీఆర్ఎస్ మండల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం సమావేశ స్థలాన్ని బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పొలాన్ని జేసీబీతో చదును చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు హాజరుకావాలని, సమావేశానికి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందజేత

జడ్చర్ల, అక్టోబర్ 12 : మండలంలోని కిష్టారం గ్రామానికి చెందిన సింగిదాస్ వెంకటేశ్(30) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయాన్ని సర్పంచ్ నర్సింహులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి దృష్టికి తీసుకెళ్లగా మృతుడి అంత్యక్రియల నిమిత్తం రూ.5వేల ఆర్థిక సాయాన్ని ప్రకటించగా ఆ డబ్బులను సర్పంచ్ నర్సింహులు మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు యాదయ్య, మాజీ ఉపసర్పంచ్ లక్ష్మయ్య, నర్సింహులు, వార్డు సభ్యులు కృష్ణయ్య, బాలరాజ్, శ్రీను పాల్గొన్నారు.